కాడెద్దులు కరువాయె..

- పెరిగిన ట్రాక్టర్ బాడుగలు
- అయోమయంలో అన్నదాతలు



పొలంలో టాక్టర్‌తో సేద్యం చేస్తున్న రైతు

యల్లనూరు: ఆరుగాలం శ్రమించి పంటలను సాగు చేస్తున్న అన్నదాతలను కష్టాలు వెంటాడుతున్నాయి. వ్యవసాయ రంగంలో అన్ని పనులూ యంత్రాలతో పనులు చేయిస్తుండటంతో రైతులకు అప్పులే మిగులుతున్నాయి. కాడెద్దులు కరువాయె....ట్రాక్టరు సేద్యం బరువాయె అన్న చందంగా తయారైంది. గతంలో పొలం దుక్కి దున్నాలన్నా, పంట సాగు చేయాలన్నా కాడెద్దులే ప్రధానం. ప్రస్తుతం గ్రామీణులు అన్ని పనులకూ ట్రాక్టర్లు, ఇతర యంత్రాలను ఉపయోగిస్తున్నారు. పొలం దున్నేందుకు ట్రాక్టర్ రూ.800 చొప్పున ధర పలుకుతోంది. అలాగే ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించారు.

ఆధునిక పరికరాలతో ....

పల్లెల్లో వృషభాల జాడ కరువైంది. గతంలో తెల్లవారగానే రైతులు ఎద్దులతో పొలాలకు చేరుకునేవాళ్లు. 10 ఎకరాలు దుక్కి దున్నాలంటే పది రోజులు పట్టేది. ప్రస్తుతం ఐదు గంటల్లో ట్రాక్టర్‌తో దున్నేస్తున్నారు. అలాగే గతంలో వేరుశనగ, వరి తదితర పంట దిగుబడులు కల్లం నుంచి ఇంటికి చేరాలంటే దాదాపు నెల రోజులు పట్టేది. ప్రస్తుతం ఆధునిక పరికరాలు ఉపయోగిస్తుండడంతో రోజుల వ్యవధిలో పంట దిగుబడులు ఇంటికి చేరుతుండడం సంతోషించదగ్గ విషయం. శింగనమల నియోజకవర్గంలో యల్లనూరు, పుట్లూరు, నార్పల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, శింగనమల మండలాల్లో రైతులు సుమారు లక్ష ఎకరాల్లో పంటలు సాగు చేసుకుంటున్నారు. చాలా మంది ట్రాక్టర్లతోనే సేద్యం చేస్తున్నారు.



ఎద్దులతో సేద్యం చేస్తున్న దృశ్యం (ఫైల్)

వేధిస్తున్న కూలీల కొరత

ఎన్ని యంత్రాలు వచ్చినా వ్యవసాయంలో కూలీల అవసరం తప్పనిసరి. పంటలు సాగు చేశాక వాటి సంరక్షణ ఎంతో కీలకం. పంటలు సాగు చేసిన 20 రోజుల నుంచే పురుగు మందులను పిచికారీ చేయాల్సి వస్తోంది. అయితే మందులు పిచికారీ చేసేందుకు కూలీలు దొరకడం లేదు. దీంతో సకాలంలో మందులు పిచికారీ చేయకపోతే సాగులో నష్టాలను చవి చూడాల్సి వస్తోంది. అంతే కాక కూలీలతో మందులను పిచికారీ చేయడం ఖర్చుతో కూడుకున్న పని అయ్యింది. దీంతో సాగులో పెట్టుబడులు పెరిగి దిగుబడులు అందక రైతులు నష్టాలు చవిచూస్తున్నారు.

గతంలో ఎద్దులకు డిమాండ్



ఎద్దులతో సేద్యాలు చాలా అరుదు. ట్రాక్టర్లతోనే చాలా మంది రైతులు సేద్యాలను చేయించుకుంటున్నారు. గతంలో ఎద్దులకు భలే డిమాండు ఉండేది. ప్రస్తుతం ట్రాక్టరు సేద్యాలపైనే అందరి గురి. అర ఎకరా ఉన్నా ఎకరా ఉన్నా...పది ఎకరాలు ఉన్నా ట్రాక్టరు సేద్యంపైనే రైతులు మొగ్గు చూపుతున్నారు.

– రమేష్, పెద్దమల్లేపల్లి, యల్లనూరు

యంత్రాల వ్యవసాయమే ఎక్కువ



ట్రాక్టర్ల వ్యవసాయమే ఎక్కువ మంది చేస్తున్నారు. ప్రతి ఇంటికి ట్రాక్టరు ఉంది. గతంలో ఎద్దులతోనే లాభసాటి వ్యవసాయం చేసేవాళ్లు . ప్రస్తుతం ట్రాక్టరుతోనే దుక్కి నుంచి విత్తనం విత్తి, పండ్లను కోసే వరకు అన్నీ యంత్రాలతోనే సరిపెట్టుకుంటున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ల గిరాకీ ఎక్కువ ఉంది.

– ఏఓ రామకృష్ణుడు, యల్లనూరు

విద్యతో పాటు ఉపాధి కల్పించడమే లక్ష్యం



విద్యాశాఖ అధికారులతో ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, అధ్యాపకులు

గుంతకల్లుటౌన్: ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే కాకుండా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే లక్ష్యమని ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. అందులో భాగంగా రానున్న విద్యాసంవత్సరం నుంచి ఉపాధితో కూడిన నూతన కోర్సులను ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు నగేష్ బాబు, రాజాహర్ష ఇద్దరు సభ్యులతో కూడిన బృందం గురువారం కళాశాలను సందర్శించింది. అప్రెంటీస్‌తో కూడిన (ఏఈడీపీ) కోర్సులను ప్రారంభించడానికి ఎస్‌కేపీ కళాశాల అన్ని అర్హతలు, వసతులున్నట్లు గుర్తించారు. సీఆర్ఐఎస్పీ సంస్థ ఇతర సంస్థల పరస్పర సహకారంతో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిని నేర్పించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. చివరి సంవత్సరంలో విద్యార్థులకు నిర్దేశిత స్టైఫండ్‌తో కూడిన శిక్షణ ఇవ్వడమే కాకుండా కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు తప్పనిసరిగా పేరుప్రఖ్యాతలు పొందిన సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, అకడమిక్ కోఆర్డినేటర్ పావని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జప్రుల్లా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ నాగరాజు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

బీసీ కులాలను ఎస్సీ, ఎస్టీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీష్

గుంతకల్లు: బీసీ కులాల్లో వెనుకబడిన మాదాసీ కురుబ, మదారి కురుబ, వాల్మీకి, రజక, బేడ, బుడగ జంగం కులాలను ఎస్సీ, ఎస్టీ జాబితాల్లో చేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదాసీ కురుబ, మదారి కురుబ కులాలకు దేశవ్యాప్తంగా కులపట్టికలో ఎస్సీ జాబితాలో సీరియర్ నంబరు 31లో ముద్రించిబడి ఉందన్నారు. ఎస్సీ జాబితాలో ఉన్నప్పటికి ఎస్సీ సర్టిఫికెట్లు మంజూరు చేయడం లేదన్నారు. దీంతో ప్రభుత్వం నుంచి అందే రిజర్వేషన్లు ఈ కులాలకు అందడం లేదని వాపోయారు. జగన్ ప్రభుత్వంలో ఈ విషయాన్ని గుర్తించి 2022, నవంబర్ 2న జీఓ 53ను విడుదల చేసి ఆర్డీఓ, తహసీల్దార్ స్థాయి అధికారులకు మదాసీ, మదారి కురబలకు సర్టిఫికెట్లు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే వీటిని అమలు చేయడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ఇక వాల్మీకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ కులాలతోపాటు బేడ, బుడగ జంగం, రజక కులాలను ఎస్సీ, ఎస్టీ జాబితాల్లో చేర్చాలని ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి రోజున ఆయా కుల సంఘాలతో కలిసి దీక్షలకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బీ.గోవిందు, వీరభద్రస్వామి, మహేష్, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్, రాముడుయల్, రామాంజనేయులు, మురళీకృష్ణ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోపాలను సరిదిద్దండి



తాడిపత్రిలో మాట్లాడుతున్న సీడీపీఓ సాజిదాబేగం



గుత్తిలో శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు



పుట్లూరులో శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

తాడిపత్రి రూరల్/గుత్తి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పోషకాహార లోపాలను సరిదిద్ది, ఆరోగ్యపరమైన ఎదుగుదలకు ప్రోత్సహించాలని సీడీపీఓ సాజిదాబేగం తెలిపారు. తాడిపత్రి పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో గురువారం అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక, విద్యాపరమైన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. చిన్నారులకు ప్రీస్కూల్ విద్యను అందించడం వల్ల ప్రాథమిక విద్యా నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. అలాగే గుత్తి పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ప్రారంభమైంది. ఏసీడీపీఓ నాగమణి, సూపర్ వైజర్లు నాగేశ్వరి, గౌరి, కృష్ణవేణి తదితరులు శిక్షణను ప్రారంభించారు. నవ చేతన ఆధార్ శీలా, పోషణ్ బీ పడాయి బీ పై శిక్షణ ఇచ్చారు. అనంతంర సూక్ష్మ పోషక లోపాలు, పోషణ ట్రాకర్, ఫీడింగ్ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు.

పుట్లూరు: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతామణి తెలిపారు. పోషణా బీ, పడాయి బీ కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు 48 మంది కార్యకర్తలకు సూపర్‌వైజర్ లావణ్య పలు అంశాలను వివరించారు.

దత్తపాదుకా క్షేత్రంలో మండల పూజలు



అలంకరణలో దత్తాత్రేయుడు



శాంతిహోమం చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని అనఘాత్రేయ దత్త పాదుకా క్షేత్రంలో గురువారం మండల పూజలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా దత్తాత్రేయుడిని శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గురు దత్త సేవాసమితి సభ్యులు ఎం.హెచ్. లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్ఎస్ఎం శ్రీధర్ ఆధ్వర్యంలో మైసూరు నుంచి వచ్చిన దత్త శంకరస్వామి సారథ్యంలో మాతాజీ సీతమ్మ సమక్షంలో అష్టోత్తర పూజలు, కార్యసిద్ధి ఆంజనేయస్వామి గోపుర కలశ కుంబాభిషేకం, నవగ్రహ విశేష అభిషేకార్చలు నిర్వహించారు. అనంతరం నవగ్రహ శాంతిహోమం, పూర్ణాహుతి గావించారు. భక్తాదులకు అన్నదానం చేశారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యుడు నవీన్‌కుమార్ బాబు

గుంతకల్లు రూరల్: ఎండలు రోజురోజుకూ తీవ్ర రూపం దాలుస్తున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్ బాబు సూచించారు. గురువారం ఆయన మండలంలోని కసాపురం ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఉండేలా చూసుకోవాలన్నారు. తగినన్ని నీరు తాగడం ద్వారా శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు. కాటన్ దుస్తులను ధరించాలని, తప్పనిసరి పరిస్థితిలో భయటకు వెళ్లాల్సివస్తే టోపీ లేదా స్కార్ఫ్ ధరించాలని సూచించారు. కాఫీ, టీ, చల్లని పానీయాలకు దూరంగా ఉండాలని, మసాల, నూనెతో తయారు చేసిన ఆహార పదార్థాలను తక్కువగా తీసుకోవాలన్నారు. కూరగాయలు, పండ్లు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ బారిన పడిన వారు వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు యాడికిలో ‘మీ మాటే ముఖ్యం’

తాడిపత్రిటౌన్ (యాడికి): యాడికి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏఎస్పీ రోహిత్ కుమార్ ఆధ్వర్యంలో మీ మాటే ముఖ్యం కార్యక్రమం నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే కార్యక్రమంలో ఏఎస్పీ నేరుగా ప్రజల సమస్యలు వింటూ అర్జీలు స్వీకరించనున్నారు. కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్పీ సూచించారు.

22 నుంచి దరఖాస్తుల స్వీకరణ

గార్లదిన్నె: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఆరో తరగతి, ఇంట ర్మీడియట్ ప్రవేశాలకు ఈనెల 22 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ చంద్రనాయక్ తెలిపారు. గురువారం ఎంఈఓ మాట్లాడుతూ ఏప్రిల్ 11 వరకూ దరఖాస్తులు స్వీకరి స్తామన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పరిమితికి మించి ప్రయాణిస్తే చర్యలు

యల్లనూరు: ఆటోలు, జీపుల్లో పరిమితికి మించి ప్రయాణిస్తే డ్రైవర్లు, వాహన యజమానులపై చర్యలు తీసుకుంటానని పుట్లూరు సీఐ సత్యబాబు హెచ్చరించారు. గురువారం తిరుమలాపురం క్రాస్‌లో వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్సులు, పత్రాలు లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. ఏఎస్ఐ నారాయణ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

పెద్దవడుగూరు: బాల్య వివాహాలు నివారించడమే లక్ష్యంగా పని చేయాలని డాక్టర్ శ్రీనివాసబాబు సూచించారు. గురువారం స్థానిక జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ మానిరింగ్ సభ్యుడిగా కుళ్లాయప్ప

శింగనమల/గార్లదిన్నె: అనంతపురం డివిజనల్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా మండలానికి చెందిన లోలూరు కుళ్లాయప్పను నియమించారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను ఆర్డీఓ కేశవనాయుడు నుంచి ఆయన తీసుకున్నారు.

26న ప్రజావేదిక

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఈనెల 26న ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బారెన్‌సాహెబ్ గురువారం తెలిపారు. మండలంలోని 25 పంచాయితీల్లో 2023, ఏప్రిల్ 1 నుంచి 31-03-2024, మార్చి 31 వరకూ జరిగిన ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృం పరిశీలిస్తున్నార న్నారు. ఈ నెల 26న ఉదయం 10:30 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.

సామాజిక తనిఖీ గ్రామసభ

యల్లనూరు: మండలంలోని బొప్పేపల్లి గ్రామ సచివాలయంలో సామాజిక తనిఖీ గ్రామసభను డీఆర్పీ మార్క్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన పనుల వివరాలు. కూలీలు చేసిన పనులు, మొక్కల పెంపకం, రైతుల వివరాలను సభాముఖంగా చదివి వినిపించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శంకర్, ఫీల్డ్‌అసిస్టెంట్ నాగభూషణ్, రైతులు పాల్గొన్నారు.

హాజీవలి ఉరుసు ప్రారంభం

తాడిపత్రి: మండలంలోని తలారి చెరువు వద్ద ఉన్న హాజీవలి దర్గాలో ఉరుసు మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉరుసుకు తాడిపత్రి ప్రాంతం నుండే కాకుండా జిల్లా నలుమూలల నుంచి, ఇతర రాష్ట్రాల భక్తులు హాజరు కానున్నారు. రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్ల బదిలీ

యల్లనూరు: మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఈసీ బబ్లు , టెక్నికల్ అసిస్టెంట్లు ప్రతాప్, శంకర్, అదిల్, శ్రీనివాసులు బదిలీ అయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన కౌన్సిలింగ్‌లో ఈ ఐదుగురు బదిలీపై వెళ్లారు. ఈసీ బబ్లు (ఆత్మకూరు), ప్రతాప్(తాడిపత్రి), శంకర్(పుట్లూరు), అదిల్ (నార్పల), శ్రీనివాసులు(పెద్దపప్పూరు)కు బదిలీ అయ్యారు.

చలివేంద్రాల ఏర్పాటు

పామిడి: పట్టణంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ఆవరణలో ఏర్పాటు చేసిన రెండు చలివేంద్రాలను గురువారం గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఎంపీడీఓ తేజోత్స్న, కూటమి నేతలు, ఆయా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీ సినిమా థియేటర్ వద్ద గొడవ

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ఎస్వీ సినిమా థియేటర్ వద్ద మున్సిల్ సిబ్బందికి, సినిమా థియేటర్ యాజమాన్యానికి మధ్య గురువారం గొడవ చోటుచేసుకుంది. మున్సిపాలిటికి చెల్లించాల్సిన రూ1.80 లక్షలు బకాయిల విషయమై థియేటర్ యాజమాన్యం, మున్సిపల్ సిబ్బంది మధ్య గొడవకు దారితీసింది. సినిమా హాల్ గేటు వద్ద ఇరు వర్గాలకూ తోపులాట జరిగింది. దీంతో సినిమా హాల్ పక్కనే ఉన్న స్టేషన్ నుంచి పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. దీంతో మున్సిపల్ సిబ్బంది విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లడంతో.. బకాయి చెల్లించడానికి సినిమా థియేటర్ యాజమాన్యానికి ఐదు రోజులు గడువు ఇచ్చారు. దీంతో సమస్య సద్దుమనిగింది.

మినుము వామి దగ్ధం

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురంలో గురువారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఉంగ్ర శివ అనే రైతుకు చెందిన మినుము పంట వామి దగ్ధమైంది. వివరాలు.. మూడెకరాల్లో రైతు మినుము పంట సాగు చేశాడు. పంట ఉత్పత్తి తొలగించిన అనంతరం పొలంలో వామి వేసి ఉంచాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు మినుము వాముకు నిప్పు పెట్టడంతో కాలిపోయింది.దాదాపు రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. ఆదుకోవాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు బాధిత రైతు ఫిర్యాదు చేశాడు.

క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ కార్యదర్శి నాగరాజు

గుంతకల్లుటౌన్: విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న వాచ్‌మెన్, ఇతర కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆలూరు రోడ్‌లోని విద్యుత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాత్రి వేళల్లో విద్యుత్ సామాగ్రిని చోరీ జరగకుండా ఉండాలంటే ఎస్‌పీఎం, ఎంఆర్‌టీ స్టోర్‌ల వద్ద లైటింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని, ముళ్లకంపలను తొలగించాలని కోరారు. అనంతరం యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా నాగరాజు, అధ్యక్షుడిగా ఎస్.కె.ఎం.బాషా, కార్యదర్శిగా రవితేజ, కోశాధికారిగా హుసేన్ పీరా ఎన్నికయ్యారు.

ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

గుంతకల్లు రూరల్: ఈ-కేవైసీ నమోదు కాని లబ్ధిదారులు ప్రతి ఒక్కరూ సంబంధిత రేషన్ డీలర్ వద్ద నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, వీఆర్వోలతో ఆమె సమావేశం నిర్వహించారు. గుంతకల్లు రూరల్, అర్బన్ ప్రాంతాల్లో 19,751 మంది రేషన్‌కార్డు లబ్ధిదారులు ఇప్పటివరకూ ఈ-కేవైసీ నమోదు చేయించుకోలేదన్నారు. ఈనెల 31లోపు సంబంధిత వీఆర్వో లేదా రేషన్ డీలర్ వద్ద ఈ-కేవైసీ నమోదుచేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో లబ్ధిదారులు రేషన్ సరుకులు కోల్పోవాల్సి వస్తుందన్నారు. లబ్ధిదారులు తమ ఆధార్, రేషన్ కార్డుతో రేషన్ డీలర్లను సంప్రదించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి




ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పామిడి: ఉపాధి పథకంకు సంబంధించి పెండింగ్ బిల్లులను తక్షణం చెల్లించాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ కే తేజత్స్నకు కూలీలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు పీ అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేసు మాట్లాడారు. మండలంలో ఉపాధి పనులకు సంబంధించి దాదాపు 10 వారాల డబ్బులు కూలీలకు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతి జాబ్‌కార్డుదారుడికి 200 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. రోజుకు రూ.600 కూలి ఇవ్వాలన్నారు. ఉపాధి పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉపాధి పథకంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. లేని పక్షాన ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

24 నుంచి ఉచిత శిక్షణ

గుంతకల్లు రూరల్: స్థానిక పీడబ్ల్యూడీ కార్యాలయం సమీపంలో ఉన్న న్యాక్ సంస్థ కార్యాలయంలో ఈ నెల 24 నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన యువతీ యువకులకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో ల్యాండ్ సర్వేయర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వడంతోపాటు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు న్యాక్ సిబ్బంది సుధాకర్ (7013858450), శ్రీనివాసులు (8555841466)ను సంప్రదించాలన్నారు.

గుత్తికోటను అభివృద్ధి చేయండి



గోపీనాథ్‌కు విన్నవిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి కోటను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని కేంద్ర పురావస్తు శాఖ అమరావతి సర్కిల్ సూపరిండెంటెంట్ డాక్టర్ గోపీనాథ్‌కు గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ విన్నవించారు. విజయభాస్కర్ గురువారం విజయవాడ వెళ్లి గోపీనాథ్‌ను కలిశారు. గుత్తి కోటను అన్నివిధాలా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని విన్నవించారు. అందుకు గోపీనాథ్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

సీఎం వైఎస్ జగన్‌తో గుత్తి నాయకుల భేటీ



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలసిన గుత్తి వైఎస్సార్‌సీపీ నాయకులు

గుత్తి: తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం రాత్రి గుత్తికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు సీవీ రంగారెడ్డి, సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, రమణా రెడ్డి, కిరణ్ తదితరులు మాజీ సీఎంను కలిశారు. పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని వైఎస్ జగన్ సూచించినట్లు నాయకులు తెలిపారు.

పరామర్శ



రామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి

పుట్లూరు: మండలంలోని చాలవేముల గ్రామానికి చెందిన రామిరెడ్డి కుటుంబ సభ్యులను గురువారం మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించారు. ఈ నెల 14న రామిరెడ్డి మృతి చెందిన విషయం విదితమే. వారు గ్రామానికి వెళ్లి రామిరెడ్డి సోదరుడు శ్రీరామిరెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి.చింతలపల్లి రామక్రిష్ణారెడ్డి, శింగనమల ప్రసాద్, చాలవేముల సాయి తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగ కొనుగోలు కేంద్రం ఏర్పాటు

తాడిపత్రిటౌన్(యాడికి): యాడికి మండలంలోని వేములపాడు పీఏసీఎస్ సొసైటీ ద్వారా పప్పుశనగ కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్నట్లు ఏఓ మహబూబ్‌బాషా తెలిపారు. ప్రభుత్వం క్వింటాల్ ధర రూ.5,650 నిర్ణయిందన్నారు. ఆసక్తిగల రైతులు రైతు సేవాకేంద్రంలో సీఎంఏ పీపీలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అమ్మిన వారం రోజుల తర్వాత నగదు రైతు ఖాతాలో జమ అవుతుందన్నారు. వివరాలకు 8331057655 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బయోమెట్రిక్ డివైజ్‌ల పంపిణీ

గుత్తి రూరల్: మండల వ్యాప్తంగా పింఛన్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన నూతన బయోమెట్రిక్ డివైజ్‌లను సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ గురువారం పంపిణీ చేశారు. గతంలో ఉన్న డివైజ్‌లు తరచూ మొరాయిస్తుండటంతో పింఛన్ల పంపిణీ ఆలస్యం అవుతుండేది. దీంతో ప్రభుత్వం మండలానికి 123 నూతన బయోమెట్రిక్ డివైజ్‌లను సరఫరా చేసింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నూతన డివైజ్‌లను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అజాగ్రత్తగా, ఇష్టానుసారంగా వ్యవహరించి డివైజ్‌లను పాడు చేసినా, ధ్వంసం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శివాజీరెడ్డి, కార్యాలయ సిబ్బంది సుమన, అబ్దుల్ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ ఆత్మహత్యాయత్నం

పెద్దవడుగూరు: మండల జోని చిత్రచేడుకు చెందిన కాంట్రాక్టర్ రాజారెడ్డి గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దవడుగూరు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సవీరా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుత్తిలో మహిళ..



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రంగమ్మ

గుత్తి: పట్టణంలోని దాసరి కాలనీకి చెందిన రంగమ్మ అనే మహిళ గురువారం విష రసాయనం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.